# సాక్షి
## అన్నమయ్య జిల్లా

శనివారం । 21 । జనవరి । 2023






**మల్చింగ్ సాగు.. లాభాలు బాగు**

రైతులు మల్చింగ్ షీట్ ద్వారా పంటలు సాగు చేసి.. బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు. -8లో..



**ఈ క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేపట్టాలి**

ఈ క్రాప్ బుకింగ్ పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.190 | రూ.280 |
| రెండోరకం | రూ.100 | రూ.186 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 158 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### తహసీల్దార్లకు పదోన్నతులు

రాయచోటి : స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లుగా పదోన్నతులు పొందిన తహసీల్దార్లకు పోస్టింగ్ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మండలాల తహసీల్దార్లు రవిశంకర్‌రెడ్డి, నాగప్రసన్నలక్ష్మీలకు పోస్టింగ్ కేంద్రాలను తెలియజేశారు. వైఎస్‌ఆర్ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రవిశంకర్‌రెడ్డిని, కర్నూలు జిల్లా కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నాగప్రసన్నలక్ష్మీని నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర పభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. వీరు త్వరలోనే బాధ్యతలను చేపట్టనున్నట్లు సమాచారం.

### బిందు, తుంపర సేద్యంతో నీరు ఆదా



రైతులకు అందించిన డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

రామాపురం: జిల్లా వ్యాప్తంగా రైతులకు నూతనంగా అందిస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని సూక్ష్మ సేద్య జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాచపల్లె, బాల్‌రెడ్డిగారి పల్లె గ్రామాల్లో రైతులకు అందించిన పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బిందు సేద్యం , తుంపర సేద్యంతో నీటిని ఆదా చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా మొక్కలకు సరిపడే నీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్‌ఐ ఇంజినీర్ గురుప్రసాద్, వీహెచ్‌ఏ అప్సర్, ఎంఐఓ వెంగయ్య పాల్గొన్నారు.

# చిరంజీవులు

- తనువు చాలించినా.. పలువురి జీవితాల్లో వెలుగులు
- బ్రెయిన్ డెడ్ వ్యక్తుల అవయవ దానంతో నిలుస్తున్న ప్రాణాలు
- ఇటీవల ప్రొద్దుటూరుకు చెందిన ఇద్దరు వ్యక్తుల అవయవాలు దానం
- కుటుంబ సభ్యుల నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు



అవయవదానం చేసిన సుచిత్ర మృతదేహానికి సెల్యూట్ చేస్తున్న ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది

సుచిత్ర (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : జీవించినప్పుడే కాకుండా మరణిస్తూ కూడా నలుగురికి ప్రాణం పోయడం మనిషికి దేవుడిచ్చిన వరం. ఒక్కరిగా మరణించినా నలుగురిలో జీవించడం అవయవదానంతోనే సాధ్యమవుతోంది. తోటి వారి క్షేమాన్ని కాంక్షించి బ్రెయిన్ డెడ్ వ్యక్తులకు చెందిన కుటుంబ సభ్యుల గొప్ప నిర్ణయంతో ఎంతో మంది ఊపిరి పోసుకుంటున్నారు. తీవ్ర దుఃఖంలోనూ వారు తీసుకునే నిర్ణయాలతో అమూల్యమైన అవయవాలు మట్టిపాలు కాకుండా అనేక మందిలో వెలుగులు నింపుతున్నాయి. అవయవదానం వల్ల ఒకరు పదుల సంఖ్యలో జీవితాలను నిలబెట్టవచ్చనే విషయం చాలా మందికి తెలియదు. మనం మట్టిలో కలవక ముందే మన అవయవాలను మరి కొందరికి దానం చేసి ప్రాణం కాపాడవచ్చు. ప్రొద్దుటూరుకు చెందిన సుచిత్ర (25), బాసిరెడ్డి అభితేజరెడ్డి (15) ఇటీవల బ్రెయిన్ డెడ్ కారణంగా మృతి చెందారు. వారిద్దరి కుటుంబ సభ్యుల సమ్మతి మేరకు అవయవాలను దానం చేశారు. అవగాహన లోపం, అపోహలు శరీరంలోని ఆర్గాన్స్ దానం చేయడానికి ప్రధాన ప్రతిబంధకాలుగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండు కుటుంబాలు తీసుకున్న నిర్ణయాన్ని అనేక మంది ప్రశంశిస్తున్నారు.

**చిన్న వయసులోనే అవయవదానం కోసం రిజిస్ట్రేషన్**

ప్రొద్దుటూరులోని శ్రీరాంనగర్‌కు చెందిన దేవరశెట్టి నరసింహులు, అనురాధలకు రూపలావణ్య, సుచిత్ర అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నరసింహులు ఏపీఎస్పీడీసీఎల్‌లో లైన్‌మెన్‌గా పని చేస్తూ రెండేళ్ల క్రితం రిటైర్ అయ్యాడు. చిన్న కుమార్తె సుచిత్ర స్థానికంగానే బీఫార్మసీ పూర్తి చేసి రెండేళ్ల నుంచి బెంగళూరులోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. గతేడాది నవంబర్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్న కంపెనీలోనే జీవన్‌దాన్ ట్రస్టు వారు అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్టు ప్రతినిథుల సందేశం తనకు ఆలోచింపచేసేలా ఉండటంతో అవయవదానం చేస్తున్నట్లు సుచిత్ర రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 27న తలనొప్పిగా ఉందని చెప్పడంతో తోటి ఉద్యోగులు ఆమెను ప్రత్యేక వాహనంలో ప్రొద్దుటూరుకు పంపించారు. తల్లిదండ్రులు స్థానికంగా ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించగా బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయిందని చెప్పారు. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి సుచరిత్రను తీసుకెళ్లారు. అక్కడ చికిత్స తీసుకుంటున్న క్రమంలో ఈ ఏడాది జనవరి 2న బ్రెయిన్ డెడ్‌తో యువతి మృతి చెందింది. అప్పటికే అవయవదానం కోసం కుమార్తె రిజిస్ట్రేషన్ చేయించినా.. తల్లిదండ్రులైన నరసింహులు, అనురాధలు అంగీకారం తెలపడంతో సుచిత్ర శరీరంలో నుంచి ఆస్పత్రిలోని ప్రత్యేక వైద్య బృందం అవయవాలను సేకరించారు.

**అవయవదానంపై అవగాహన పెరగాలి**

అవయవదానంపై ప్రజల్లో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉంది.అవయవాలు కావాలని జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉందని, అయితే అందుకు తగ్గట్టుగా అవయవ దానం జరగలేదని అధికారులు చెబుతున్నారు. మనకు తెలిసిన వారు బ్రెయిన్‌డెడ్ అయిన సందర్భాల్లో వారి కుటుంబాలను ఒప్పంచి అవయవాలను దానం చేసేలా చూడాలి. ప్రభుత్వం, ఎన్జీఓలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

### ▶▶ నేత్రదానంపై అవగాహన కల్పిస్తూ..



మధుసూదన్‌రెడ్డి

ప్రొద్దుటూరుకు చెందిన మరో వ్యక్తి నేత్రదానంపై 14 ఏళ్ల నుంచి అవగాహన కల్పిస్తున్నారు. మధుసూదన్‌రెడ్డి 2008లో స్నేహసేవా సమితి అనే స్వచ్ఛంద సేవాసంస్థను స్థాపించారు. 2009లో డాక్టర్ వైవీ లక్ష్మీదేవి నేత్రనిధిని ఏర్పాటు చేశారు. నేత్రదానంపై జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేశారు. ఇప్పటి వరకు 502 మంది నుంచి మరణానంతరం 1004 కార్నియాలను సేకరించారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం వల్ల ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 6 వేల మందితో నేత్రదానంపై అంగీకార పత్రాలు తీసుకున్నట్లు తెలిపారు.

### ▶▶ అవయవదానం పొందిన స్ఫూర్తితో విస్తృతంగా ప్రచారం



ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కొవ్వూరు రమేష్‌రెడ్డి అవయవదానం పొంది 2003లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. 2202లో ఆయనకు కాలేయం సమస్య రావడంతో ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో చూపించినా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఒక్కటే మార్గమని చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో అప్పుడే గ్లోబల్ ఆస్పత్రిని నిర్మించారు. స్నేహితుల బలవంతం మేరకు ఆయన కాలేయ మార్పిడి ఆపరేషన్ కోసం ఆస్పత్రికి వెళ్లారు. గ్లోబల్ ఆస్పత్రికి అది మొదటి కేసు కావడంతో అత్యంత జాగ్రత్త, శ్రద్ధతో కాలేయ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి 10 ఏళ్ల వరకు గ్యారెంటీ ఇచ్చారు. అయితే 20 ఏళ్లు దాటినా కొవ్వూరు రమేష్‌రెడ్డి పూర్తి ఆరోగ్యంతోనూ. క్షేమంగా ఉన్నారు. అవయవదానం పొందిన స్ఫూర్తితో ప్రతి ఏటా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

### ▶▶ తను లేకున్నా..



అభితేజరెడ్డి (ఫైల్)

నక్కలదిన్నె గ్రామమనేది ప్రొద్దుటూరు మండలంలోని ఒక చిన్న పల్లెటూరు. ఆ గ్రామంలో నివసిస్తున్న బాసిరెడ్డి అభితేజరెడ్డి (15) ఈ నెల 16న బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందాడు. నిద్రలో ఉండగా అర్ధరాత్రి సమయంలో ఈ నెల 14న మతి స్థిమితం కోల్పోయిన అతని తండ్రి నరసింహారెడ్డి గొడ్డలితో దాడి చేశాడు. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన అభితేజరెడ్డిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కోమాలో ఉన్న బాలుడు కోలుకోలేక పోవడంతో 16న రాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు మృతి చెందాడని పుట్టెడు దుఃఖంలో ఉన్న తల్లి తులశమ్మకు అవయవదానంపై కుటుంబ సభ్యులు అవగాహన కల్పించారు. తన కుమారుడు చనిపోయినా నలుగురి జీవితాల్లో వెలుగులు నింపుతాడని భావించిన తల్లి అందుకు అంగీకారం తెలిపింది. ఒక చిన్న పల్లెటూరులో అవయవదానంపై చైతన్యం రావడం అభినందించదగ్గ విషయమని బాలుడి కుటుంబ సభ్యులను పలువురు ప్రశంశిస్తున్నారు.

### మా అమ్మాయిని చూసి గర్వపడుతున్నాం



మా అమ్మాయి బ్రెయిన్ డెడ్ కాక ముందు అవయవదానం చేస్తున్నట్లు జీవన్‌దాన్‌లో రిజిష్టర్ చేసుకుంది. తర్వాత నెలన్నరకే చనిపోయింది. సుచిత్రను చూసి తల్లిదండ్రులుగా గర్వపడుతున్నాం. చిన్న వయసులో పెద్ద నిర్ణయం తీసుకుంది. మా కూతురు వల్ల నలుగురు ప్రాణం పోసుకుంటుంటే అంతకంటే ఆనందం ఏముంటుంది.

– నరసింహులు, అనురాధ (సుచిత్ర తల్లిదండ్రులు), ప్రొద్దుటూరు

# కానిస్టేబుల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు**



రాయచోటి : అన్నమయ్య జిల్లాలో నిర్వహించనున్న పోలీసు ఉద్యోగ రాత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి పరీక్షల నిర్వహణపై ప్రత్యేక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీ ఆదివారం జరగనున్న కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల నేపథ్యంలో భద్రతా చర్యలు, నియమ నిబంధనలపై అన్నమయ్య జిల్లా ఎస్పీ వివరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 పరీక్షా కేంద్రాలలో 13,684 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు.

**ఇవీ సూచనలు:**

- పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారన్నారు. 10 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని తెలియజేశారు. కావున అభ్యర్థులందరూ ఉదయం 08.30 నుండి 9 లోపల పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించేదిలేదని చెప్పారు.
- రాజంపేటలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, అన్నమయ్య ఇంజినీరింగ్ కళాశాల మదనపల్లెటౌన్‌లోని ఎంఐటీఎస్, ఆదిత్య కళాశాలలు, కృష్ణారెడ్డి ఫార్మసీ కాలేజీ, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల పరీక్షా కేంద్రాలు మెయిన్ రోడ్డుకు దూరంగా ఉండటం వల్ల అభ్యర్థులు నిర్ణీ సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు.అభ్యర్థులు హాల్‌టికెట్, ఒక ఒరిజినల్ ఫోటో, గుర్తింపుకార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు మాత్రమే తీసుకురావాలని జిల్లా ఎస్పీ సూచించారు.

**అవకతవకలకు పాల్పడితే చర్యలు**

- అభ్యర్థులు అవకతవకలకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. తద్వారా భవిష్యత్తులో ఉద్యోగాలకు వారు అనర్హులు అవుతారన్నారు.
- కాపీయింగ్ లేదా మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే తదుపరి పోలీసు నియామకాలలో జీవితాంతం ప్రవేశం కోల్పోవడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామన్నారు

**మోసపోవద్దు:**


- వరినీ నమ్మవద్దని, ఎవరైనా మీకు ఉద్యోగం ఇప్పిస్తామని కానీ, పరీక్షలలో సహాయం చేస్తామని మాయమాటలు చెప్పి డబ్బులు తీసుకుని ఉంటే వెంటనే డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు.
- జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సీఆర్‌పీసీ అమల్లో ఉన్నందున ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. కేంద్రాలకు దగ్గరలో ఉన్న జిరాక్స్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లన్నీ మూసివేయాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో నిరంతరం తనిఖీలు జరుగుతాయన్నారు. జరుగుతుందన్నారు.

**హెల్ప్ డెస్క్:** రాజంపేటలో పాత, కొత్త బస్టాండ్, రైల్వేస్టేషన్‌లోనూ, మదనపల్లెలో చిత్తూరు బస్టాండ్, బెంగళూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో అభ్యర్థుల సౌలభ్యం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఈ హెల్ప్ డెస్క్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది, అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల గురించి సమాచారం, కేంద్రాలకు ఏ విధంగా చేరుకోవాలి.. అనే విషయాలపై సహకారం అందిస్తారు. అలాగే జిల్లా పోలీస్ కార్యాలయంలో కూడా సీఐ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

### సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది వ్యక్తిగత, స్పౌష్, పిల్లల ఆరోగ్య సమస్యలు, వినతి బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. వారి సమస్యలను సానుకూలంగా విన్న జిల్లా ఎస్పీ సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంది ఇచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

### నేటి నుంచి కడప రాయుని బ్రహ్మోత్సవాలు



ఉభయ దేవేరులతో కడప రాయుడు

కడప కల్చరల్: కడప రాయుడు దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఉత్సవాల ప్రారంభానికి దీక్షా తిరుమంజనం నిర్వహించనున్నారు. సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో సేనాధిపతి ఉత్సవం, అనంతరం అంకురార్పణ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా స్వామితోపాటు సుదర్శన చక్రతాళ్వార్‌లను ప్రతిష్టించి పూజలు జరుపుతారు. అర్చకులు, కార్యక్రమ నిర్వాహకులు ఊరేగింపుగా ఆలయ పుష్కరిణి వద్దకు వెళ్లి అక్కడ పుట్టమన్ను సేకరించి (మృత్సంగ్రహణం) సంప్రదాయంగా దాన్ని పల్లకీలో ఆలయానికి చేర్చనున్నారు. అనంతరం శాస్త్రోక్తంగా ఆ మట్టిలో బీజాలు చల్లి అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు.

# వేగంగా ప్రభుత్వ భూముల గుర్తింపు

**అధికారులకు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశం**

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అసైన్మెంట్ భూముల గుర్తింపును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆర్డీఓలను, తహసీల్దార్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో అసైన్మెంట్ భూములు, బీఎస్ఎన్ఎల్‌కు భూమి కేటాయింపు, రీ–సర్వే, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో స్మశాన వాటికలకు స్థలాల గుర్తింపు, క్లరికల్ కరెక్షన్స్ ఆఫ్ మాడ్యుల్స్ డిజిటల్ సిగ్నేచర్ స్టేటస్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు. మండలాల్లో తహసీల్దార్లు విధులపట్ల పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలో అసైన్మెంట్ భూములు దాదాపు 500 ఎకరాలు గుర్తించినట్లు చెప్పారు. వారంలోగా 800 ఎకరాల భూమిని గుర్తించడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ భూమి ఒకసెంటు కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలన్నారు. తమతమ పరిధిలోని వాగులు, వంకలు, పోరంబోకు స్థలాలను కాపాడాలన్నారు. అలాగే బీఎస్ఎన్ఎల్‌కు స్థలాల కేటాయింపును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వాము, మురళీ, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

**30 లోగా అంగన్‌వాడీ కేంద్రాలకు న్యూట్రిషన్ కిట్లు అందాలి**

రాయచోటి అర్బన్: ప్రతినెలా 30వ తేదీలోపు అంగన్‌వాడీ కేంద్రాలకు వైఎస్ఆర్ఎస్‌పీ న్యూట్రిషన్‌కిట్లు అందాలని జిల్లా కలెక్టర్ గిరీషా పియస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఆయన స్త్రీశిశు సంక్షే మ,సాధికారతశాఖ అధికారుల పనితీరుపై సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌ఎస్‌పీ న్యూట్రిషన్ కిట్లు లబ్ధిదారులకు అందచేయడంలో జాప్యం జరుగుతుండడంపై ఆయన ఆగ్రహించారు. కిట్స్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. మరోమారు ఇలా జరగకూడదంటూ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. జిల్లాలో అనీమియాతో బాధపడుతున్న గర్భిణుల శాతాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రీస్కూల్ అటెండెన్స్ 95 శాతానికి తగ్గకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్క అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నెలలో తప్పక 20 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరలో జిల్లాలో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన ఉన్నందున అన్ని అంగన్‌వాడీ కేంద్రాల రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఐసీడీఎస్ పీడీ, సాధికారత ఇన్‌చార్జి అధికారిణి దనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షలో జేసీతో కలిసి పాల్గొన్న కలెక్టర్ గిరీషా పీఎస్

### ఖైదీల్లో సత్ప్రవర్తన కోసం కృషి

- జైళ్లశాఖ డీఐజీ రాహుల్



మాట్లాడుతున్న జైళ్లశాఖ డీఐజీ రాహుల్

పీలేరు: పీలేరు సబ్‌జైల్‌ను జైళ్లశాఖ కడప డీఐజీ ఎస్. రాహుల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఖైదీలను అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఖైదీల్లో సత్ప్రవర్తన రావాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సబ్‌జైళ్లలో ఖైదీలకు మంచి ఆహారాన్ని అందించేందుకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాయలసీమలో 33 జైళ్లు ఉన్నాయని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 363 ఖైదీలు జైళ్లలో ఉన్నారన్నారు. వీరి కోసం కొన్ని జైళ్లలో యోగా శిక్షణా తరగతులు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు వాల్మీకిపురం సబ్‌జైలు పనులు 75శాతం పూర్తయ్యాయని, మిగిలిన 25శాతం పనుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సబ్ జైల్ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ రవిశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# అయ్యో.. దేవుడా !

- చాపాడు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం
- తిరుమల నుంచి ప్రొద్దుటూరు వెళుతూ లారీని ఢీకొన్న టెంపో
- ముగ్గురు మహిళలు మృతి.. 8 మందికి తీవ్రగాయాలు
- 15 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనగా దుర్ఘటన



చాపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం



మృతిచెందిన రామలక్షుమ్మ



ఓబులమ్మ



అనూష

చాపాడు/ప్రొద్దుటూరు క్రైం : పండుగకు అప్పులందరూ కలిశారు. పండుగయ్యాక గోవిందుడి సన్నిధికి వెళ్లాలనుకున్నారు. తిరుమల వెళ్లి వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీస్వరుడిని కూడా కొలిచారు. సంతోషంతో తిరుగుపయనమయ్యారు. 15 నిమిషాల్లో ఇక ఇంటికి చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. ముగ్గురు తిరిగిరాని లోకాలకు చేరుకోగా.. 8మంది తీవ్రంగా గాయపడ్డారు. అందరూ గాఢ నిద్రలో ఉండగా చాపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దుర్ఘటనలో అక్కాచెల్లెళ్లతో పాటు వీరి కూతురు మృత్యువాత పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందుల మండలంలోని ఇనగలూరుకు చెందిన గంగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి సోదరులు 20 ఏళ్ల క్రితం ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీకి వచ్చి స్థిరపడ్డారు. వేరుశనగక్కాయ మిల్లును ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇద్దరూ ఒకే ఇంట్లో పెళ్లి చేసుకున్నారు. గంగిరెడ్డికి భార్య రామలక్షుమ్మతో పాటు అనూష, అనిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. అనూషకు మూడేళ్ల బాబు ఉన్నాడు. భర్త విజయ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వారి స్వగ్రామం వీఎస్‌పల్లె మండలంలోని తాటిమాకులపల్లె. సంక్రాంతి పండుగకు రమ్మని చెప్పడంతో ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు ఇక్కడికి వచ్చారు. ప్రొద్దుటూరుకు వచ్చిన వారు మూడు రోజుల పాటు బంధువులతో సరదాగా గడిపారు. ఎలాగూ అందరూ కలిశారు కాబట్టి గంగిరెడ్డి అల్లుళ్లు, కూతుళ్లను తిరుమలకు తీసుకెళ్లాలని భావించాడు. ఈ మేరకు టెంపో వాహనాన్ని బాడుగకు మాట్లాడుకున్నారు. దర్శనానికి వెళ్లే విషయం గంగాధర్‌రెడ్డికి చెప్పడంతో భార్య ఓబుళమ్మ కూడా వారి వెంట వెళ్లింది. అందరూ కలిసి బుధవారం ఉదయం ప్రొద్దుటూరు నుంచి టెంపో వాహనంలో బయలుదేరారు. తిరుమల దర్శనం తర్వాత శ్రీకాళహస్తికి వెళ్లారు. అక్కడ దర్శనం ముగించుకున్న అనంతరం శుక్రవారం రాత్రి ప్రొద్దుటూరుకు బయలుదేరారు. అయితే మరో 15 నిమిషాల్లో ప్రొద్దుటూరుకు చేరుకుంటారనగా చాపాడు వద్ద రోడ్డు పక్కన ఆగివున్న బొగ్గు లారీని టెంపో ఢీ కొనడంతో తల్లీ కూతుళ్లు రామలక్షుమ్మ (52), అనూష(28)తో పాటు రామలక్షుమ్మ సోదరి ఓబుళమ్మ(47)మృతి చెందారు. రామలక్షుమ్మ భర్త గంగిరెడ్డి, అనూష భర్త విజయకుమార్‌రెడ్డితో పాటు రామకృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, జయలక్ష్మీ, రామాంజనేయమ్మ, గంగా అనితలతో పాటు డ్రైవర్ అంజనేయరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ధరణి అనే బాలికతో పాటు మరో రెండేళ్ల పాప ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. వీరందరినీ 108 వాహనాల్లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో గంగిరెడ్డి ప్రైవేటు ఆసుపత్రికి, రిటైర్డు బ్యాంకు ఉద్యోగి రామకృష్ణారెడ్డిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఘటనపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రామలక్షుమ్మ, ఓబుళమ్మ, అనూషల మృతదేహాలకు వారి స్వగ్రామాల్లో అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనా స్థలాన్ని శుక్రవారం ఉదయం ప్రొద్దుటూరు ఆర్టీఓ సుశీల సిబ్బందితో కలసి పరిశీలించారు.

**బాధితులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పరామర్శ**

చాపాడు మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. రోడ్డుపై నిలిపిన లారీని తిరుమల నుంచి వస్తున్న టెంపో వాహనం ఢీ కొన్న విషయం తెలిసిందే. జిల్లా ఆస్పత్రికి చేరుకున్న ఎమ్మెల్యే మార్చురీలోని మృతదేహాలను పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని కు టుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలోనే ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా

### పాము కాటుతో తీవ్ర అస్వస్థత

మదనపల్లె : పొలం వద్ద యువకుడిని పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. జర్రావారిపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన సుధాకర్ కుమారుడు గణేష్ (24) పశువులను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్న సమయంలో పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. వారు బాధితుడిని హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

### తాళం వేసిన ఇంటికి కన్నం

– రూ. లక్ష నగదు, నగలు అపహరణ

మదనపల్లె : పట్టణంలో ఓ ఇంటి తాళం పగులగొట్టి దుండగులు చోరీకి పాల్పడ్డారు. నీరుగట్టువారిపల్లెకు చెందిన చగన్‌లాల్ స్థానికంగా కూలీ పనులు చేస్తూ నివసిస్తున్నాడు. ఇటీవల ఆయన కుటుంబంతో కలిసి తీర్థయాత్రల సందర్శనలో భాగంగా రామేశ్వరం వెళ్లారు. శుక్రవారం ఇంటికి చేరుకోగా తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువా లాకర్లు ధ్వంసం చేసి సామగ్రి చిందరవందరగా పడవేసి ఉన్నారు. ఆధారాల సేకరణకు పోలీసులు క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బీరువాలో రూ.లక్ష నగదుతోపాటు 20 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

### విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి


మృతి చెందిన సురేంద్రరామ్

రాజంపేట : పట్టణ శివారులోని మన్నూరులో రవి నడుపుతున్న రైస్ మిల్లులో కరెంటు షాక్‌తో బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు సురేంద్రరామ్ (45) గురువారం మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎస్ఐ భక్తవత్సలం శుక్రవారం తెలిపారు. మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌లో ఉంచారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బంధువులు రాగానే మృతదేహాన్ని అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. బతుకుదెరువు కోసం రాజంపేట వచ్చి రైస్ మిల్లులో పని చేస్తుండే వాడు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు.

# మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- బహుళ ప్రయోజనాలు
- ఏక కాలంలో రెండు పంటలు
- ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ
- ఆసక్తి చూపుతున్న రైతులు


మల్చింగ్ షీట్‌పై సాగు చేస్తున్న పంటలు (ఇన్‌సెట్) కర్బూజలో బొప్పాయి నాటిన దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే లాభాలు గడించవచ్చు. ఇందులో భాగంగా రైతులు మల్చింగ్ షీట్ ద్వారా పంటలు సాగు చేసి.. బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా బొప్పాయి, అరటి, కర్బూజ, దోస, టమాట, మిరప, పూలు తదితర పంటలను మల్చింగ్ పద్ధతిలో పండిస్తున్నారు. ఏ వాతావరణ పరిస్థితులలో అయినా పలు రకాల పంటలకు ఉపయోగపడుతుంది. ఈ విధానంలో డ్రిప్ నీటి పారుదల ఉండటం వల్ల వర్షాలు తక్కువ, ఎక్కువ వచ్చినా మొక్కల పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కలుపు నివారణ, తీగ పంటల దిగుబడి దెబ్బతినకుండా, పురుగులు ఎక్కువ ఆశించకుండా ఉండటం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అధికారులు కూడా పంటలకు మల్చింగ్‌షీట్‌ను సూచిస్తున్నారు. మరి కొంత మంది రైతులు పాత పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లి, లక్కిరెడ్డిపల్లి, వాయల్పాడు, కలికిరి, తంబళ్లపల్లి, పీలేరు తదితర మండలాలలోని గ్రామాలలో మల్చింగ్ షీట్ ద్వారా పంటలు పండిస్తున్నారు.

**తక్కువ ఆశించనున్న తెగుళ్లు**

చిన్న పంటలను కూడా మల్చింగ్ ద్వారా పండిస్తే.. వర్షాభావ పరిస్థితులలో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్ పైపు ఉండడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టు కింద భూమి పొడిగా ఉండి వేరువ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. కలుపు నివారించవచ్చు. డ్రిప్ ద్వారా వేసిన ఎరువులు మొక్కలకు బాగా అందుతాయి. భారీ వర్షాలు పడినా తెగుళ్లు తక్కువగా వస్తాయి. కీడు కలిగించే పురుగులు షీట్ వల్ల మొక్కలకు తక్కువగా ఆశిస్తాయి. పంట నాణ్యతతోపాటు దిగుబడి పెరుగుతుంది. 35 మైక్రాన్స్ షీట్ వాడుకోవడం వల్ల రైతులు రెండు పంటలు పండించుకోవచ్చు.

**కలుపు నివారణ**



గత కొంత కాలంగా మల్చింగ్ షీట్ ద్వారా టమాట పంటను ఎకరా పొలంలో పండిస్తున్నాను. రెండు పంటలకు మల్చింగ్ షీట్ వల్ల ఉపమోగం ఉంది. ముఖ్యంగా కలుపు బెడద వుండదు. దీనివల్ల కూలీల భారం తగ్గుతుంది.

– సి.భాస్కర్‌రెడ్డి, గంగాపురం నిమ్మనపల్లి, మదనపల్లి మండలం

**వర్షాలతో ఇబ్బంది ఉండదు**



నేను రెండు ఎకరాలలో కర్బూజ పండిస్తున్నాను. అందులో బొప్పాయి నాటాను. మొదట పంటగా కర్బూజ అవ్వగానే బొప్పాయి సాగు చేశాను. రెండు పంటలు బాగున్నాయి. మల్చింగ్‌లో ఏ పంట పండించినా ఎడతెరిపి లేక భారీ వర్షాలు పడినా ఇబ్బంది తక్కువగా ఉంటుంది.

– అనీల్‌కుమార్‌రెడ్డి, రాఘవరాజపురం, రైల్వేకోడూరు మండలం

**వేరు వ్యవస్థ బాగుంటుంది**



మల్చింగ్ పద్ధతి వల్ల పంటలకు నీరు, ఎరువులు సక్రమంగా అందుతాయి. వేరు వ్యవస్థ బాగుంటుంది. నీరు తక్కువగా ఉన్నా ఇబ్బంది కలగదు. తేమ ఆరకుండా ఉంటుంది. చెడు చేసే పురుగులు కవరు వల్ల మొక్కలను ఆశించకుండా ఉంటాయి. వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి.

– ఆయేషా, ఉద్యానశాఖ అధికారిణి, రైల్వేకోడూరు మండలం

### వ్యవసాయ పరికరాలు సరసమైన ధరకు అందించాలి

రాయచోటి : జిల్లాలో వ్యవసాయ యంత్ర పరికరాలను సరసమైన ధరలకు అందించాలని జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వ్యవసాయ యంత్ర పరికరాల సరఫరా అంశంలో డీపీఎంసీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లాలోని వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసేటటువంటి డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, పరికరాల తయారీదారులు పాల్గొన్నారు. జిల్లాలో యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించడానికి ధర నిర్ణయం కోసం చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు, ఏపీ ఆగ్రోస్ జిల్లా మేనేజర్, జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చిట్వేలి : మండల పరిధి నక్కలపల్లి అటవీ ప్రాంతంలోని పాదలకొండ వద్ద పెట్లూరి సురేష్(33) చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భార్య తనను వదిలేసి వెళ్లిపోయిందన్న మనస్తాపంతో సురేష్ ఉండేవాడు. బుధవారం సాయంత్రం గ్రామం నుంచి అడవిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. మేకలకాపర్లు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేటకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈ క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేపట్టాలి


మాట్లాడుతున్న చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి. చిత్రంలో జేసీ తమీమ్ అన్సారియా

రాయచోటి : రబీ ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అధ్యక్షతన జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ ద్వారా ప్రాక్యూర్మెంట్, ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం జరుగుతోందని, ఇందులో క్షేత్రస్థాయిలో రైతులు ఏ పంట సాగు చేశారు, ఎన్ని ఎకరాలలో వేశారు తదితర అన్ని రకాల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా చిరు ధాన్యాలను సబ్సిడీపైన రైతులకు అందించి వాటి సాగును ప్రోత్సహించాలని అధికారులను కోరారు. జిల్లాలో వ్యవసాయ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరంగా ప్రకటించినందున రైతులకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించి వాటి సాగును ప్రోత్సహించే విధంగా సూచనలు, సలహాలు క్షేత్రస్థాయిలో అందివ్వాలని తెలిపారు. అధికారులందరూ కూడా సమన్వయంతో పని చేసి రైతుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. డీఆర్‌డీఏ శాఖ ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మునగ తోటలను అభివృద్ధి చేసే కార్యక్రమాలను విస్తృతం చేయాలని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ శాఖ ద్వారా పట్టుగూళ్ల పెంపకానికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు సబ్సిడీకి అవకాశం కలదని, ఇది మంచి లాభదాయకమైన పంట కావున ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు బోధషావలి, ప్రసాద్, రవికుమార్‌రెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారి రాజశేఖర్‌రెడ్డి, డ్వామా పీడీ మద్దిలేటి, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా దర్గా స్వామీజీ ఆరాధన

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామ సమీపంలో శ్రీ దర్బారు సాయి నగరంలో వెలసిన శ్రీ దర్గా స్వామిజీ చతుర్థ ఆరాధన ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు గంగపూజ, కలశ స్థాపనం, పుణ్యాహవాచనం, రుద్రాభిషేకం, మహామంగళహారతి, సాయంత్రం గురుపూజ, విష్ణు సహస్రనామార్చన సత్సంగం, సాయంత్రం ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం 7గంటలకు కలశపూజ, సద్గురు పూజ, రుద్రాభిషేకం, గణపతి, నవగ్రహ రుద్ర, సద్గురు హోమాలు, పూర్ణాహుతి, మహామంగళహారతి, సత్సంగం, ప్రసాద వితరణ, సాయంత్రం పల్లకి మెరవణి, ఉత్సవం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పూజ కార్యక్రమం నిర్వహిస్తున్న వేద పండితుడు

## సీమ స్థాయి క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ముక్కా సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె : మండలంలోని చల్లెంపాలెంలో రాయలసీమ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి ముక్కా సాయివికాస్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా మొదటి బహుమతి లక్ష యాభై వేలు, రెండవ బహుమతి యాభై వేల రూపాయలు అందజేస్తామని తెలిపారు. టోర్నమెంటులో మొత్తం 27 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ ఆరవ శ్రీధర్, ఎంపీటీసీ విజయ్‌కుమార్, రైల్వే కమిటీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, గద్దె పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి

- కబడ్డీ సంఘం ప్రతినిధులు
- జిల్లా కబడ్డీ జట్లు ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్.గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం కడప నగరంలోని బసవతారం న్యాయకళాశాల ఆవరణలో జిల్లాస్థాయి సీనియర్ విభాగం మహిళలు, పురుషుల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం కోశాధికారి, కోచ్ జనార్ధన్ మాట్లాడుతూ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 150 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు అంజని, చౌడేశ్వర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు సురేష్‌యాదవ్, సుకుమార్, సురేంద్ర, జుల్ఫికర్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు**

**మహిళల జట్టు :** ఎస్.రుక్సాన, ఎస్.పూజ, ఎ.పుష్పలత, ఎం.మమత, ఎస్.నాగజ్యోత్స్న, ఎస్.ఇందు. టి.భార్గవి, వై.రజిత, సి.భార్గవి, ఎం.పౌర్ణమి, టి.మైథిలి, ఆర్.మహి. స్టాండ్‌బై : చంద్రవదన, టి.కావ్యశ్రీ, బి.మానత, సి.హరిణి, ఎం.ప్రమీల.

**పురుషుల జట్టు :** కె.శివారెడ్డి, ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.ప్రేమ్‌చంద్‌రెడ్డి, బి.ఇర్ఫాన్, ఎస్. కిరణ్‌కుమార్, వంశీధర్‌రెడ్డి, ఎం.రాజ్‌కుమార్‌నాయక్, సి.చెన్నకృష్ణ, చెన్నకేశవరెడ్డి, బి.వంశీ, స్టాండ్‌బై : టి.సుకుమార్, అనిల్‌చౌదరి, ప్రదీప్‌కుమార్.

## క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

**ఈ నెల 22న సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ**

SAKSHI DIGITAL MEDIA GROUP — SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి. ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

**టోర్నీ ఫార్మాట్..**

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

**ఎంట్రీ ఫీజు..**

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

**ఏ ఏ విభాగాల్లో...**

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

**ఎన్ని జట్లకు అవకాశం..**

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

**ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:** 9010224479, 9912440776

**గమనిక:** అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

### వంట చేస్తుండగా మంటలు అంటుకుని..

– వృద్ధురాలికి తీవ్ర గాయాలు

మదనపల్లె : కట్టెల పొయ్యి మంటలు అంటుకుని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ రాయునిచెరువువడ్డిపల్లెకు చెందిన వెంకటమ్మ (80) ఇంటి వద్ద కట్టెల పొయ్యి వెలిగించి వంట చేస్తుండగా ఆమె వస్త్రాలకు మంటలు అంటుకున్నాయి. దీంతో బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. గాయపడిన వృద్ధురాలిని 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

### వాహనం ఢీకొని జింకకు తీవ్ర గాయాలు


గాయపడిన జింకకు చికిత్స అందిస్తున్న అధికారులు

ములకలచెరువు : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఒక జింకకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, అటవీ శాఖ అధికారుల కథనం మేరకు... మండలంలోని వేపూరికోట పంచాయతీ ఆర్‌ఎస్ కొత్తపల్లి వద్ద జింకల మంద రోడ్డు దాటుతుండగా వాహనం ఒక జింకను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జింకకు తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ప్రయాణికులు గమనించి ప్రాణంతో ఉన్న జింకకు నీళ్లు తాపించి అటవీ శాఖ బీటు అధికారి గోపాల్‌కు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని జింకను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ములకలచెరువు పశువైద్యశాలలో చికిత్స అందించి దుసానివారిపల్లెలోని అడవి జంతువుల సంరక్షణ కేంద్రంలో వదిలిపెట్టినట్లు అటవీశాఖ అధికారి పేర్కొన్నారు.

### టిప్పర్ ఢీకొని వృద్ధురాలికి..


చికిత్స పొందుతున్న చెన్నమ్మ

నిమ్మనపల్లె : టిప్పర్ వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం నిమ్మనపల్లెలో జరిగింది. స్థానిక పెద్దమాదిగపల్లెకు చెందిన లక్ష్మన్న భార్య టీ.చెన్నమ్మ (75) నిమ్మనపల్లె బస్టాండులో ఉండగా మదనపల్లెకు చెందిన టిప్పర్ వాహనం కందూరు వైపు వెళుతూ ఢీకొంది. టిప్పర్ వాహనం వృద్ధురాలిని కొంతదూరం ఈడ్చుకుని వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితురాలిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్సలు అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు ప్రమాదానికి కారణమైన టిప్పర్ వాహనాన్ని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### 23న గ్రహణ మొర్రి బాధితులకు శిబిరం

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు సంబంధించిన గ్రహణ మొర్రి బాధితులకు ఈనెల 23న ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. కడపలోని సమగ్రశిక్ష కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ముకుందరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి హైదరాబాదులోని బసవ తారకం ఇండో అమెరిక్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాధితులకు అలవెన్స్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు.

### రేపు స్పెల్‌బీ సెమీఫైనల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ (మూడవ రౌండ్) పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరీల వారీగా తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని హోలీగ్రీన్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు సాక్షి ఈవెంట్స్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ తెలిపారు. ఇది వరకు పాఠశాల, జిల్లా స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో ప్రతిభ చూపి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తిరుపతి, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు కేటగిరి-1, 10.30 నుంచి 11 గంటల వరకు కేటగిరి-2, 11 నుంచి 11.30 గంటల వరకు కేటగిరి-3, 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేటగిరి-4 విభాగాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు వారి స్కూల్ యూనిఫాం, ఐడీ కార్డుతోపాటు పెన్ను/పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్‌తో పరీక్ష సమయానికి ముందే చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన తరువాత అనుమతి ఉండదని ఆయన వివరించారు.